# మూడో పిల్ల

భార్యను పురిటికి పుట్టినింటికి పంపిన రోజునుండి, రామానుజం ప్రతిరోజూ ఆ వచ్చే శుభవార్తకోసం ఎదురు చూస్తున్నాడు. భార్య వెళ్ళిన వారం రోజులకు రామానుజం ఆఫీసునుండి ఇంటికివచ్చేటప్పటికి, వచ్చివున్న పోస్టుకార్డు ఏ శుభవార్తనూ తీసుకరాలేదు. అతనిభార్య క్షేమంగాచేరిందనీ, వుందనీ మామగారు రాశాడు.

రామానుజం అప్పటికే ఇద్దరు ఆడపిల్లల తండ్రి. మళ్ళీ ఆరుసంవత్సరాలకు రామానుజం మూడోసారి తండ్రి కాబోతున్నాడు. ముసిముసినవ్వులు నవ్వుతూ ఒకనాటిరాత్రి భార్యచెప్పిన ఆవిషయాన్ని విని రామానుజం, సమయానుకూలంగాసంతోషించినా, ఆ తెల్లవార్లూ ఆలోచిస్తూనేవున్నాడు, పుట్టబోయే శిశువునుగురించి.

నిజంచెప్పాలంటే రామానుజానికి కూతుళ్ళిద్దరిమీదా ఎంతో ప్రేమ. అయినా ఆడపిల్లలనగానే సామాన్యంగావుండే భయం మాత్రం అతనికి లేకపోలేదు. అందుకు ఇతర కారణాలు ఎలావున్నా, ముఖ్యంగా తల్లిదండ్రులపైనా, పుట్టినవాళ్ళిద్దరూ అతనిలా ఎర్రగావుండటమే. నల్లగావున్న ఆడపిల్లల కంటే, ఎర్రటివాళ్ళకోసం వరుణ్ణి వెదకాల్సిన బాధ కొంత తగ్గుతుందనీ, చెప్పులరిగిపోయేటట్టు తిరగనక్కర్లేదని, ఆడాళ్ళందరికీ అదో ప్రత్యేకమైన యోగ్యతాపత్రమనీ అతని ఉద్దేశం!

వీటికితోడు మరోవిషయంకూడా అతని తలంపులోవుంది. - కాళ్లు కడిగి కన్యాదానంచేసినదగ్గరనుండీ, తను వియ్యంకుడికీ, తనభార్య వియ్యపురాలికీ చేతులు నలుపుకుంటూ ఒదిగి ఒదిగి వుండాలని. ఆడపిల్ల పుట్టినప్పటినుండీ లేనిబాధ్యత, ఆ పిల్లకు పెళ్లిచేసి అత్తవారింటికి పంపగానే వచ్చిపడుతుంది. అల్లుడికి జరగాల్సిన మర్యాదల్లోగాని, తదితర్లకు చెయ్యవలసిన లాంఛనాల్లోకాని ఏమాత్రం లోటు కన్పించినా, ఆడపిల్లను కన్నందుకు తనభార్య; మర్యాదలను, లాంఛనాలను కావలసినరీతిగా జరపలేకపోయినందుకు తనూ తిట్లు తిని, ఏ మైసూరుపాకమో రసగుల్లాలో తిన్నట్లు చప్పరించి వూరుకోవలసిందేకాని కిక్కురుమనడానికి వీల్లేదు - అథవా అభిమానం పొడుచుకొచ్చి జవాబు చెప్పామా, పిల్లదాని జీవితం దినదిన గండం దీర్ఘాయుష్షూ అవుతుందేమోనని భయం!

ఒకవేళ దురదృష్టవశాత్తు అలాగే అయితే; ఆపిల్ల దూరంగా వుండడం చేత తల్లినీ తండ్రినీ నోటికొచ్చినట్లల్లా తిట్టడానికి వీల్లేని కారణంగా, చేతికొచ్చినట్లల్లా వ్రాసి తండ్రికి ఒక ఉత్తరం పోస్టులో పడేసి చేతులు దులుపుకుంటుంది. ఆ సమయంలో నవమాసాలూ మోసి కన్నతల్లికాని, అష్టకష్టాలుపడి పెంచి పెళ్ళిచేసిన తండ్రిగాని; కొత్తగా వచ్చిపడ్డ అత్తమామలు, భర్తకంటె సన్నిహితులుగా కన్పించనే కన్పించరు! - ఇక ఆ ఉత్తరం చదివిన భార్య నేరమంతా భర్తదేనన్నట్లు, భర్త యింటికి వచ్చీరాగానే ఆ ఉత్తరాన్ని ముఖానకొట్టి, వంటయింట్లోంచే పట్టలేని కోపంతో కూరగాయలు తరుగుతూన్న తొందరలో వేలు తెగినా లక్ష్యపెట్టక, మేఘం వురిమినట్లు వురిమి, వర్షం కురిసినట్లు కన్నీళ్లుకార్చి, తను పడ్డ శ్రమంతా వృథాచేసి, తనకీ తన కూతురుకీ తీరని అపకారం చేసిన శత్రువును చూసినట్లు చూస్తుంది. ఇక ఆ క్షణంనుంచీ ఇంట్లో ఎదురుగా మూతి ముడుచుకూర్చున్న భార్యను లాలించలేక, తనమీద కోరి తెచ్చుకున్న అధికారులైన వియ్యాలవారిని తృప్తిపరచలేక తన పని తలకిందులవుతుంది. అందరినీ తను బ్రతిమాలుకోవలసిందేకాని, తన పరిస్థితిని చూసి ధైర్యం చెప్పేవాళ్లుకాని, కనీసం తనమీద జాలిపడేవాళ్లుకాని ఒక్కరు కనిపించరు. ఇంత హంగామాకు కారణం, తను ఆడపిల్లలనుగన్న తండ్రి కావడం!!

రామానుజానికి ఇవన్నీ ఆడపిల్ల పుట్టిన తర్వాత వచ్చిన ఆలోచనలూ, ఊహించరాబోయే అనుభవాలూను! కాగా - అతను ప్రత్యక్షంగా చూసిన విషయం ఒకటుంది. తన పెదతండ్రి కూతురు కాంతం విషయం. వాళ్లది ఎప్పటికప్పుడు భుక్తికి సరిపోయే సంసారం. ఆయనకు కలిగింది ఒక ఆడపిల్ల. పట్టరానివాళ్ల కాళ్లు పట్టుకుని, అభిమానం సంపాదించి ఎంతో బాధపడి బి. ఏ. దాకా చదివించాడు. పెద్దచదువు చదివిస్తే కట్నం కోరకుండా చదువుకున్న పిల్ల కాబట్టి వరుడు కోరుకునే వస్తాడని అభిప్రాయపడి చేసిన పిచ్చిప్రయత్నం! తీరా పెళ్లి ప్రయత్నాలు ప్రారంభించేసరికి 'పిల్లకు చదువుంటే వూళ్లేలుతుందా, ఉద్యోగాలు చేస్తుందా? కన్నవారి కటిక దరిద్రాన్ని తీసుకవచ్చి అత్తవారిల్లు గుల్ల చెయ్యడం తప్ప!' అన్న వాక్యాలు విని నిలువునా కుంగిపోయాడు పాపం! ఇంతా జరిగినతర్వాత కూడా ఈడూ జోడూ కుదిరిన ఎలాంటి సంబంధమైనా చూసి, ఆ బరువూ భారమూ వదిలించుకుందామని శల్లమాలిన ప్రయత్నం చేశాడు. ఎక్కడెక్కడ ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఫలించకపోవడమూ, వలచి వలపించుకోవలసిన వయస్సు దాటిపోతున్నా ఆ పిల్ల కన్నవారిల్లు దాటిపోయే శుభముహూర్తం ఏ పంచాంగంలోనూ లేకపోవడమూ జరిగింది.

ఇలాంటి విషయాలూ, సందర్భాలూ రామానుజం బుర్రలో కాపురా లేర్పరచుకొని, ఆడపిల్ల పుట్టిన మరుక్షణంనుండీ అతన్ని బల్లెంతో పొడిచినట్టు ఒకప్రక్క పొడుస్తూనే వున్నయ్. పైగా అతని భార్య మళ్ళీ గర్భవతై పురిటికి వెళ్లి వుంది. ఇక వచ్చే ఆ శుభవార్తకోసం రామానుజం మనసులో మనసులేక, ఎదురుచూడ్డం మొదలు పెట్టాడు.

* * *

ఆవేళ ఆఫీసునుంచి ఇంటికి వచ్చేటప్పటికి, వంటింట్లోంచి తల్లి కేకపెట్టింది: "రామానుజం! ఉత్తరం వచ్చింది. అద్దం ఇరుకున పెట్టాను" అని.

రామానుజానికి ముచ్చెమటలూ పట్టినయ్. కాళ్లకింద భూమి తిరుగుతూన్నట్లనిపించింది... నెమ్మదిగా వెళ్లి ఉత్తరంతీశాడు. అతని మామగారి కంత తీరుబడో కాని కాస్త కాళీకూడా వదలకుండా నలుపుచేసి పారేశాడు. ఉత్తరం తొందర తొందరగా నోట్లోనే చదువుకోడం ప్రారంభించాడు. ఉత్తరం చదవడం పూర్తయ్యేసరికి వంటయింట్లోంచి తల్లివచ్చి "మీ మామగారి దగ్గరనుంచేనా?" అంది.

"ఆ! ఆయనే రాశాడు"

"ఏమిటి సంగతులు. కోడలికి పురుడు వచ్చిందా?"

# ★ మూడో పిల్ల ★

"అహో! రానూవచ్చింది. మరో ఆడపిల్ల పుట్టనూపుట్టింది" అన్నాడు. అతనిముఖంలో తల్లికి, ఏమంత ఉత్సాహరేఖలు గోచరించలేదు.

"ఏమిట్రా ఆ మాట. ఆడపిల్లయితే ఇప్పుడువచ్చిన నష్టమేముంది; నీ పిచ్చిగాని. అదీగాక అంతా ఆ భగవంతుడి ఆజ్ఞ కాని మనలో ఏముంది!" అంటూ సముదాయించబోయింది.

"అవునవును. అంతా ఆయన ఆజ్ఞే!" అంటూ విసురుగా బయటికి వెళ్లిపోయాడు.

ఆ రాత్రి భోజనాలదగ్గరవచ్చింది మళ్లీ ఈ ప్రస్తావన.

"ఏంరా! రామానుజం! బారసాల విషయం ఏమన్నా రాశాడా?"

"ఆ! అన్ని ఏర్పాట్లూ ఆయనే చేస్తున్నట్టు నిన్నూ నన్నూ రమ్మని రాశాడు"

ముసలావిడ మారువడ్డిస్తూ "లక్ష్మి సరస్వతి పార్వతుల్లా ముగ్గురు. వాళ్లిద్దరూ తండ్రిపోలిక. మరి ఇదెలా వుంటుందో" అంది.

"నాయనమ్మలా వుంటుందిలే!" అంటూ చిరాగ్గా విస్తరివద్దనుండి లేచిపోయాడు.

* * *

రామానుజం ఎంత కూడదన్నా, బారసాలకు వెళ్ళక తప్పిందికాదు. గుమ్మంలో అడుగుపెట్టేటప్పటికి, మామగారు ఎదురై "ఏమోయ్! రెండు రోజులు ముందుగా వస్తావనుకున్నాం— పదండి లోపలకు" అంటూ పరామర్శించాడు.

సమాధానం చెప్పకుండానే, రామానుజం అరుగుమీద కుర్చీలో కూలబడి, చేతిలో పత్రిక తిరుగవెయ్యడం ప్రారంభించాడు.

పదినిముషాలు గడిచేటప్పటికి, లోపలినుంచి చినబావమరది పూడిపడి "బావగారూ! మా అక్క పిలుస్తూంది" అన్నాడు.

"ఎందుకూ?"

"అదే! ఆసంగతి చెప్పడానికే!" అంటూ వీధిలోకి తుర్రుమన్నాడు.

పెంకివెధవా! అనుకున్నాడు రామానుజం మనసులో.

లోపలకు వెళ్లేటప్పటికి, హాల్లో అత్తగారు ఎదురై "ఏం! నాయనా! వచ్చి రావడం వీధిలోనే కూచుండిపోయావే - అదో! అలా వెళ్లు" అంటూ ఆవిడ పనిమీద ఆవిడ వెళ్లిపోయింది.

భార్యవున్న గదిలోకి మహాకష్టంగా వెళ్ళి నిలుచున్నాడు. చేతిలో పత్రిక పేజీలు తిరగవేస్తూ. పాపం! ఎంతో ఆత్రుతగా భార్య దగ్గరకు వచ్చి "లోపలకు రాకుండా వీధిలోనే కూర్చుండిపోయారేం?" అంది.

రామానుజం చేతిలోవున్న పత్రిక తిరుగవేస్తూ - సమాధానం చెప్పలేదు. ఆమెవంక ఒకసారిచూసి, దృష్టి మరల్చుకున్నాడు.

"నాకు తెలుసు మీరు ఎందుకలా వున్నారో!" అంది నవ్వుతూ.

"ఎందుకేం?' అన్నాడు.

"మళ్లీ ఆడపిల్లనికదూ?" అంది.

ఈసారి రామానుజానికి అనుకోకుండా వెన్నుమీద చరిచినట్లయింది. భార్యవంక తీవ్రంగా చూశాడు.. చేతిలోవున్న పత్రికను విసిరికొట్టి, భార్య బతిమాలుతున్నా వినిపించుకోకుండా వీధిలోకి వచ్చేశాడు.


* * *

ఇక అక్కడవున్న రెండురోజులూ, రామానుజం అతికష్టంగానే గడిపాడు. భార్యమీద అతనికి అపరిమితమైన కోపం వచ్చింది. మూడవసారికూడా ఆడపిల్లే కలిగినందుకు బాధపడుతున్న అతని హృదయం భార్య మాటలకు మరీ దెబ్బతిన్నది. - ఎగతాళిచేసినట్లయింది.

జరగవలసిన కార్యం పూర్తికాగానే, ఆరోజురాత్రే తిరిగి ప్రయాణమయ్యాడు.



గ్రీష్మస్నానము



గ్రీష్మ సంధ్య

ఫొటో: ఆర్. శివారెడ్డి—ముద్దనూరు.

"అదేమిటి? అక్కడ ఏమంత తొందర పనులున్నాయని ఈరాత్రిపూటే వెళ్లడం. తెల్లవారి తీరుబడిగా వెళ్లొచ్చునులే" అన్నారు మామగారు.

ఆమాటలు వినేటప్పటికి రామానుజానికి ఎంత ఆవేశం వచ్చిందో చెప్పలేం. ఆయన అలా అంటూవుంటే హేళన చేస్తున్నట్టనిపించింది. తనకేమీ పనిలేనట్లు, ఏదో ఊరికే పనిలేక తిరుగుతూన్నట్లు ఆయన ఉద్దేశించి మాట్లాడినట్లు రామానుజం అనుకున్నాడు. ఏదో గట్టిగానే చెప్పదామనుకున్నాడు; కాని మాటలు రాలేదు.

"అలా కాదు తప్పకుండా వెళ్లాలి రేపు ఆఫీసుకు వెళ్ళకపోతే మాట వస్తుంది" అన్నాడు ముక్తసరిగా.

"అలా అయితే మరో రెండురోజులు శెలవు పొడిగించరాదూ."

"ఇవ్వరు" అన్నాడు పెదిమలు బిగబట్టి

రామానుజం మామగారు అతనివంక ఒకసారి చూసి, ఇక ఆ విషయం మాట్లాడ్డం అనవసరం అనుకున్నాడో ఏమో "సరే! నీ ఇష్టం" అంటూ వెళ్లిపోయాడు.

ఆరాత్రి భోజనాలు తొందరగా ముగించుకుని, వేళకు ముందుగానే రైలుస్టేషను చేరుకున్నాడు రామానుజం తల్లితో. రామానుజం భార్య గుమ్మంవద్ద నిలబడి వుండడం చూసికూడా ఆమెను పలకరించనే లేదు!

వియ్యపురాలిని గుమ్మంలో బండి ఎక్కించి, లోపలికివచ్చి "ఏమే! విశాలా! మీ ఆయన ఈసారి అంత మూతి ముడుచుక్కూచున్నాడు. బిడ్డలతండ్రైనా ఇంకా ఈ పను లేమిటే - నీతో కూడా సరిగా మాట్లాడినట్టు లేదు" అంది కూతురుతో.

"అబ్బే! నాతో మాట్లాడకేం - మాట్లాడారు" అంటూ తన గదిలోకి వెళ్లిపోయింది విశాల

"ఏమిటో తల్లీ! ఈ చిత్రమైన కోపాలు, తాపాలూను. మీకే అర్థమవాలి" అంటూ ఆవిడ పనిమీద ఆవిడ వెళ్లింది.

విశాల తల్లికి ఏదో సమాధానం చెప్పిందే కాని, ఆమె మనస్సులో బాధగానే వుంది. కాని అంతవరకూ ఎలాగో ఇముడ్చుకోగలిగింది. ఆ విషయాన్నే తల్లి హెచ్చరించేటప్పటికి, ఆమెకు తెలియకుండానే రెండు కన్నీటిబొట్లు రాలినయ్.

* * *

నిజానికి రామానుజం అత్తవారింటినుండి తిరిగివచ్చిన మరునాడుకూడా శెలవుంది. కాని అతని మనస్తత్వం అతన్ని అక్కడ వుండనివ్వలేదు. అత్తవారింట్లో అంతా విరోధుల్లాగే కనిపించారు అతనికి. ఇంటికి చేరగానే కాలకృత్యాలు తీర్చుకుని, ముసుగుతన్నాడు. రామానుజంతల్లి వంటపనంతా పూర్తిచేసుకుని వచ్చి లేపింది.

"రామానుజం! పదకొండవస్తోంది. లేచి భోజనానికి రా!" రామానుజం ఒకసారి కదిలి, మళ్ళీ అటువైపుకు తిరిగి పడుకున్నాడు

"లేరా! ఆఫీసుకు వేళయింది"

"ఫరవాలేదులే. కాస్సేపు ఆగుదూ" అన్నాడు మగతలోనే.

"ఏం? ఆఫీసుకు వెళ్లవా?"

"అబ్బ! చంపక నువ్వు అవతలకు వెళ్లు. ఇవాళకూడా శెలవుందికాని" అంటూ విసుక్కున్నాడు.

"అరి నియిల్లు బంగారంగాను! ఈరోజు కూడా శెలవుందనుకు నేనా, అంత హడావిడి చేశావ్. ఈపూటకూడా ఆ పిల్లతో గడిపి వస్తే ఎంత బావుండేది. ఆయన మాటతోసి పుచ్చివచ్చినందుకు మీ మామగారు ఎంత నొచ్చుకున్నాడో పాపం!" అంది కొడుకు చేసిన ఘనకార్యానికి ఆశ్చర్యపోయి.

"మరేం మునిగిపోలేదు లెద్దూ మహా



క్రిందపడి కాళ్లా చేతులా బెణికితే



అమ్మ అమృతాంజనంవాడింది



వెంటనే తగ్గిపోయింది !

**అమృతాంజనము**




అన్ని నొప్పులు జలుబులు,
దగ్గులు మొదలైన వాటికి కూడా
అమృతాంజనమే వాడండి.


వుండమన్నాడు కాని!" అంటూ చీదరించుకున్నాడు.

"అదేవిట్రా ఆ మాటలు ఆయనేంచేశాడు పాపం! — ఇప్పటివరకూ అత్తవారింటికి వెళ్ళినప్పుడల్లా రెండురోజుల్లో తిరిగివస్తానని వారం పదిరోజులదాకా పత్తాలేకుండా పోయేవాడివి. ఇంతలో ఏం ముంచుకొచ్చింది. ఆయనమీద ధూంధాముక్కడానికు ఆడపిల్ల కలగడమేం కొదుకదా !"

"ఏదోఒకటి. నువ్వూరుకుందూ"అంటూ ఆదరాబాదరా లేచి నూతి దగ్గరకు వెళ్లిపోయాడు.

"బావుందిరా వరస! వయస్సు వస్తున్నకొద్దీ పెద్దమనిషనిపించుకోవాలిగాని, ఈకసురుకోవడాలు, విసుక్కోవడాలు ఏమిటి?" అంటూ ఆమెకూడా వెనకాలేవడ్డన ప్రయత్నంచేయడానికి, వంట ఇంట్లో ప్రవేశించింది.

* * *

ఆరోజు సాయంకాలమయినా రామానుజం ఇల్లువదల్లేదు. రాత్రల్లా రైల్లో ప్రయాణం కారణంగా నిద్రలేనందువల్ల కలిగిన నీరసము, పగలల్లా నిద్రపోయిన కారణంగా అతన్నావరించుకుని వదలని మత్తువల్లు ఇంట్లోనే వుండిపోయాడు.

దీపాలవేళ అయేటప్పుడు, మిత్రుడు, అతని తోటిగుమాస్తా మూర్తి వచ్చి పిలిచాడు.

రామానుజం బయటికి వచ్చిచూసి "రావోయ్ మూర్తీ" అంటూ ఆహ్వానించాడు.

"కంగ్రాచులేషన్స్ ! రామానుజం! అదృష్టం అంటే నీదేరా!" అంటూ లోపలికొచ్చి కూచున్నాడు.

"నువ్వొకడివీ నా ప్రాణం తియ్యడానికి. అంతా అయి పదిహేనురోజులు పైగా ఐతే, ఏమో తెలియనట్లు ఇవాళ తీరుబాటు చేసుకుని వచ్చావా? కంగ్రాచులేట్ చెయ్యడానికి" అన్నాడు నిరుత్సాహంగా రామానుజం.

మూర్తి తెల్లమొగం వేశాడు!!

"ఏమిటీ? నీకు పదిహేనురోజులక్రిందటే తెలుసా? నాకు తెలీదే? నువ్వు మాటవరుసకన్నా చెప్పలేదే?" అన్నాడు.

రామానుజానికి విషయం అర్థంకాలేదు. – నిజానికి మూర్తి తీసుకొచ్చిన వార్త ఒకటి, రామానుజం తలచింది మరొకటీను!

"అసలు సంగతేమిటి మూర్తీ? నీమాటలు చూస్తే వింతగావుంది" అన్నాడు మూర్తి వైపు అద్భుతగా చూస్తూ.

"నువ్వేమనుకున్నావ్ ?" అన్నాడు మూర్తి.

"అదేరా! మా ఆవిడకు మరో ఆడపిల్ల ......"

అరోక్తిలో అంగుకుని "ఛత్! అది కాదోయ్! మరొకసంగతి – ఏదీ ! ముందు కాఫీ పోయించు. ఆతర్వాత మాట్లాడుకుందాం?"

"కాఫీకేం తక్కువ లేదు!" అంటూ ఇంట్లోకి దృష్టి సారించి "అమ్మా! కొంచం కాఫీపెట్టవే" అని కేకవేసి, మళ్లీ మూర్తి వంకతిరిగి "ఊఁ! ఇక చెప్పు నువ్వు తెచ్చిన ఆవార్తలు" అన్నాడు.

"అబ్బె! కాఫీ రానియ్! అది లోపలకు వెళ్తేకాని, వార్తలు బయటికిరావు"అన్నాడు మూర్తి.

అంతలోనే అక్కడకు వచ్చిన రామానుజంతల్లి "వేళకానివేళ కాఫీ ఏమిటి నాయనా! కాస్తోకూస్తో తక్కువగా భోజనంవేళయిందిగా. భోజనంచేసే వెళ్దూగాని" అంది మూర్తితో.

"భోజనాలుపెట్టే కార్యక్రమం అంతా ముందుందిలెండి. ప్రస్తుతానికి తాజావార్త తెచ్చినందుకు కాఫీ ఇవ్వాల్సిందే" అన్నాడు మూర్తి నవ్వుతో.

"ఇంతకీ ఆవార్త ఏమిటో" అంది రామానుజం తల్లి ఎంతో కుతూహలంగా.

మూర్తి ఒక్కసారి రామానుజంవంక చూసి, చిన్నన వ్వునవ్వి "మీవాడికి హెడ్‌గుమాస్తాగా ప్రమోషను వచ్చిందండి. మన వూళ్లోనే సబ్‌కలెక్టరు ఆఫీసుకు వేశారు" అన్నాడు.

రామానుజం ఎగిరి గంతేశాడు!!

"అబ్బ! బంపావురా! ఈ వార్త చెప్పడానికి – ఎప్పుడొచ్చినయ్ ఆర్డర్లు?" అన్నాడు రామానుజం, సంతోషంతో పొంగిపోతూ.

"ఇవాళే. రెండు మూడు రోజుల్లో రిలీవ్ చేసేస్తారు. ఆఫీసులో అంతా నీకోసం ఎదురుచూస్తుంటే."

"అంతా ఆ పుట్టినదాని అదృష్టం! లక్ష్మీదేవిలా శుక్రవారంపూట పుట్టింది. మావాడు ఆడపిల్ల పుట్టిందంటూ అందరిమీదా అలిగి కూచున్నాడు. చూడరా! పుడుతూనే ఎలాంటి అదృష్టాన్ని తీసుకొచ్చిందో నా బంగారు తల్లి!" అంటూ ఆనందంతో మురిసిపోయింది రామానుజం తల్లి !

"ఏమిటమ్మా! నువ్వు ప్రతివిషయానికి అర్థంలేకుండా సామ్యాలు తీసుకొస్తావు. నాకు ప్రమోషన్ రావడమేమిటి, దాని అదృష్టమేమిటి?" అంటూ చిరాకుపడ్డాడు రామానుజం.

"అది అంతేలే! తినేవాళ్లు అదృష్టవంతులైతేనే, సంపాదించేవాడికి ఇలాంటి మంచి జరుగుతూవుంటుంది. మనం సంపాదిస్తున్నది

వకోసమా? పెళ్లాన్నీ పిల్లల్నీ పోషించేందుకు, సుఖపడేందుకూనా" అన్నాడు మూర్తి.

"అలా చెప్పు నాయనా! మావాడికి." అంటూ రామానుజంవైపు తిరిగి "వెంటనే కోడలికో కార్డురాసి పడేయ్. ఈవార్త వింటే ఇక దానికి పట్టపగ్గాలుండవు. మనిషంటే అక్కడుందికాని, మనసంతా ఇక్కడే - నాకు తెలుసు దాని తత్వం!" అని నవ్వుకుంటూ లోపలకు వెళ్లిపోయింది.

రామానుజం తల్లిమాటలకు సిగ్గుపడ్డాడు!

"నువ్వు ఈ విషయంలోనూ అదృష్టవంతుడివేరా. అనుకూలంగా అత్తా కోడలూ వుండి సాఫీగా సాగిపోతూన్న సంసారాలు చాల అరుదు. ఆవిడ చూడు నిన్నుగురించి ఎంత బాధపడుతూందో. కొంప తీసి - ఆడపిల్ల పుట్టిందని నీ భార్యను ఏమన్నా అన్నావా ఏమిట్రా?" అన్నాడు మూర్తి.

"అబ్బెబ్బె! అదేం లేదురా!"

"ఏమోలే! నీ కంతగా తెలియనట్టుంది ఈ ఆడవాళ్ల సంగతి. మన మేదో మేధావుల మనుకుని ఇటువంటి విషయాల్లో వాళ్లను వేసే పిచ్చిప్రశ్నలకు, సమాధానంగా మనల్నే ఒక మొండి ప్రశ్న వేస్తారు. దాంతో ఉచ్చులోపడ్డ పక్షిలా గిలగిల తన్నుకోవాలి. - జాగ్రత్త!" అన్నాడు మూర్తి.

ఇద్దరూ నవ్వుకున్నారు.

* * *

ఆ రాత్రంతా నిద్రకు నోచుకోలేదు రామానుజం. తెల్లవార్లూ ఏవో పిచ్చి పిచ్చి ఆలోచనలతోనే గడిపాడు. తల్లి అన్న మాటలు నిజమే. విశాల తనను ఎంత ప్రేమిస్తుంది! కొత్త తలనొప్పి వచ్చిందంటే చాలు, తను అనుభవిస్తూన్నట్లే ఆమె బాధపడుతుంది. ఎంత లాలన, ఎంత పాలన!

పాపం! ఎంత బ్రతిమాలినా వినకైనా వినకుండా, తోసుకు వచ్చేసి ఆమెకు అంత కష్టం కలిగించిన తర్వాత ముందు వెనుకలు ఆలోచించకుండా తొందరపడి, తనే ఇటువంటి పరిస్థితిని కల్పించాడు. ఎంత వేగం ఈ వార్త ఆమెకు చెప్పివేద్దామా అని ఉబలాటం. కాని ఒకవేపు అభిమానం అడ్డువస్తూంది. తీరా ఈ సంగతి చెప్పినతర్వాత ఆమెకూడా తల్లి అన్నట్లే అంటే!

ఇక ఆమెకు ఉత్తరం రాసే దెలా!

తెల్లవార్లూ ఇలాంటి ఆలోచనల్లోనే తలంతా పాడుచేసుకుని, రామానుజంకూడా తల్లి వచ్చిన నిర్ణయానికే వచ్చాడు!

బారసాలకు వెళ్లినప్పుడు తను ఇంట్లోకి వెళ్ళకపోగా, ఆమె కబురంపించినప్పుడు కసురుసలాడుతూ వెళ్లి పలకరించకపోయినా ఎంత ఓపికతోనూ, ఉత్సాహంతోనూ పలకరించి, చిరునవ్వుతో ఆదరించింది. నవమాసాలు మోసి కన్నబిడ్డను భర్తకు చూపాలని, భర్త ఆనందంతో తన్ను ఆదరిస్తే మురిసిపోవాలని ఏ స్త్రీకి వుండదు.

* * *

బారసాలకువచ్చి వెళ్ళిన తర్వాత భర్త దగ్గరనుండి ఒక ఉత్తరంకూడా రానందుకు విశాలమనసు ఎంతో కించపడింది. ఒకటి రెండుసార్లు మనసు వుండబట్టలేక తండ్రిని అడిగింది కూడాను. 'రామానుజం ఉత్తరం రాస్తే నీకు చెప్పకుండా వుంటానా తల్లీ!' అన్నాడాయన—కాని విశాల తల్లిమాత్రం ఆ భార్యాభర్తల ఇద్దరి మధ్యా యేదో





ఆమె తన బిడ్డలకు
అదనపు పోషణకు
ఓవల్టిన్ యిస్తుంది

చాలినంత పుష్టికరమైన ఆహారంమీదనే మంచి ఆరోగ్యం ఆధారపడి వున్నదనే సంగతి తెలిసివున్న తల్లులు ప్రపంచ మంతటా తమ బిడ్డలకు పుష్టికరమైన "ఓవల్టిన్" యిస్తున్నారు. బిడ్డలు తమ సత్తువను శీఘ్రంగా వ్యయంచేస్తారు కాబట్టి వారికి అదనంగా పుష్టికావలెను.

"ఓవల్టిన్" ప్రకృతి సిద్ధమైన ఉత్తమ ఆహారములనుండి తయారు చేయబడినది దీనిలో అదనంగా వి. డి విటమినులు గూడ చేర్చబడినవి. ఈ పానీయము బిడ్డలను పగలంతా ఉత్సాహంగాను, చురుకుగాను వుంచి, రాత్రిళ్లు హాయిగా నిద్రపట్టడానికి తోడ్పడును. వెంటనే మీ బిడ్డలకు "ఓవల్టిన్" ఇవ్వడం ప్రారంభించండి.

# ఓవల్టిన్




మంచి ఆరోగ్యానికి బలిష్ఠమైన పునాది

డిస్ట్రిబ్యూటర్లు: గ్రహామ్సు ట్రేడింగ్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్.

'ఓవల్టిన్' అమెచూర్ కార్యక్రమం సిలోన్ రేడియోలో శనివారాలు రా 8 నుండి 8-30 గంటల వరకు వినండి. (హిందీ-41.72 మీటర్లు)

IV.443

# ★ మూడో పిల్ల ★

చిలిపికజ్జా వచ్చిందని మాత్రం గ్రహించింది. ఆఖరికి ఒకరోజు అడిగింది కూడాను

"ఏమే! అమ్మాయ్! మీ ఆయన ఎందుకే మనమీద అలిగినట్లున్నారు" అంది.

"అల్లాంటి దేమీ లేదమ్మా" అంది విశాల.

"నా దగ్గరకూడా దాస్తావెందుకే విశాలా! ఇంతకుముందు ఎప్పుడైనా నువు పదిరోజులపాటు ఇక్కడికొస్తే, రెండు సార్లైనా వచ్చి చూసిపోయేవాడుకదా. ఈసారిమాత్రం మాటా పలుకూ లేకుండా వుండిపోయాడేం?" అంది లౌక్యంగా.

విశాలకు సమాధానం చెప్పుకోవలసి వచ్చింది!

ఒకవేళ నిజం చెపితే?—చిలిపిగా వుండదూ! అమ్మ ఏమనుకుంటుంది. నాన్నకు తెలిస్తే ఆయన ఏమంటాడు తన భర్త ఇంత బుద్ధిహీనుడా? అనుకోరూ! మరి తల్లినీ తండ్రినీ ఈ విషయంలో ఎలా సముదాయించడం?

ఆ సమయానికి తోచిన ఏదో ఒక జవాబు చెప్పి, తప్పించుకుంది కాని తల్లి ముఖం చూస్తే ఆ సమాధానంతో తృప్తిపడినట్లు మాత్రం కనిపించలేదు. తిరిగి అడిగా బలవంత పెట్టలేదు.

కాని విశాలకుమాత్రం ఇదో పెద్ద బెడదయింది. మనశ్శాంతి లేకుండా బాధపడసాగింది. తల్లీ తండ్రీ, తమ కాపురంలో ఏదో అనర్థం ఏర్పడిందనుకుంటున్నారేమోనని ఆమె బాధ! ఈ చిక్కు విడదియ్యడం ఎలా?

ఆ రాత్రంతా ఆలోచించింది. భరించలేని ఆవేశంవచ్చి ఏడ్చింది కూడాను! చివరికి తనే ఒక ఉత్తరం వ్రాయాలనుకుంది—

"అమ్మ గుచ్చి గుచ్చి అడుగుతూంది మీ రెండుకు ఇంత ముభావంగా వున్నారని? ఏం చెప్పను? ఎవరిమీద చెప్పను? ఒక వేళ నిజం చెప్పేస్తే వాళ్ళేమనుకుంటారు?

"మీ రెందుకింతకఠినంగా మారిపోయారు. పుట్టినపాపే అందుకు కారణమైతే, నిజంగా నేనెంతో దురదృష్టవంతురాలిని. ఆడపిల్లలైతే వచ్చినబాధ ఏమిటో నాకు అర్థం కావటం లేదు. ప్రపంచంలో ఆడపిల్లల్ని కన్నతండ్రులంతా మీలాగే మనసులు విరుచుకుంటున్నారా? ఇంతవరకూ ఏ ఒడుదుడుకులూ లేకుండా సాఫీగా సాగిపోతూన్న మన సంసారంలో, ఏగొడవా లేకపోయినా; ఈనాటికి బాధపడేట్టు చేస్తున్నారు ఈ విషయంలో నేనెంతవరకూ బాధ్యురాలినో మీరు ఊహించలేరా?

"ఇప్పటికైనా మీ కోపాన్ని పోగొట్టుకుని, దయచేసి జవాబు వ్రాయండి. ఎదురు చూస్తూవుంటాను. లేకపోతే ఇంతవరకూ ఓపికతో మింగుతూవచ్చిన దుఃఖవాహిని పొంగి పొరుల్తుందేమో! అప్పుడు పరిస్థితులు మరీ చిక్కుగా పరిణమించవచ్చును.

"మూడవ నెల రాగానే వచ్చి తీసుకు వెళ్ళండి. మీ విశాల"

ఆ ఉత్తరాన్ని వందసార్లైనా చదివి వుంటాడు రామానుజం ఏమీ పాలుపోలేదు. ఉత్తరం రాయడానికి ముఖం చెల్లక వూరుకున్నాడు. కాని మరో కారణమేముంది? కాని ఆ ఫలితం ఈవిధంగా వుంటుందని ఆనాడు ఊహించలేకపోయాడు. అయితే ఇప్పుడీ ఒడుదుడుకుల్ని దాటడం ఎలా?

పూర్తిగా ఇంతగొడవకూ కారణం తనే. తన తొందరవల్లే విశాల అలాంటి క్లిష్టపరిస్థితుల్లో ఇరుక్కుంది. విశాల మనస్సును అనవసరంగా బాధకు లోనుచేశాడు. కనీసం తల్లి మందలించినరోజునైనా తను నిజాన్ని గుర్తించివుంటే పరిస్థితి ఇంతగా మారి వుండేదికాదు.

వెంటనే మామగారి పేర ఒక జాబు వ్రాసి పోస్టు చేశాడు. అందులోని ముఖ్యవిషయాలు రెండేరెండు:

"జాబు వ్రాయడం ఆలస్యం అయినందుకు మన్నించండి.. ...... ...... . . కొత్త ఉద్యోగం కావడంవలన, శలవు దొరకడం కష్టం మూడవ నెలరాగానే బావమరిదినిచ్చి విశాలను పంపండి పాపకు ముద్దులు!!"

* * *

అనుకున్న గడువుకంటే ముందుగానే అందిన ఉత్తరాన్ని చదువుకుని మురిసిపోయింది. తల్లికి చదివి వినిపించింది ఆ ఆనందంలో పాపను పదిసార్లు ముద్దుపెట్టుకుంది. కాలండరుదగ్గరికెళ్ళి మనసులోనే రోజులు లెక్కపెట్టేసింది. ఆ రాత్రి తేలికైన మనసుతో హాయిగా పాపపక్కలో నిద్రపోయింది విశాల!

* * *

మూడవ నెలరాగానే తమ్ముణ్ణి తోడు తీసుకుని పిల్లలతో వచ్చింది విశాల మామగారు రాసినప్రకారం, రామానుజం రైలుకు వెళ్ళి ఆమెను ఇంటికి తీసుకువచ్చాడు. పాపను భర్తకందించి, చిరునవ్వుతో రైలోంచి దిగుతూన్న విశాలను చూసి రామానుజం కొత్త పెళ్ళికొడుకయ్యాడు!!

ఆ మరునాటి సాయంకాలం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేటప్పటికి, చంటిపాప ఇల్లు బద్దలయ్యేట్లు ఏడుస్తూంది. విశాల, అత్తగారూ ఒకరు వంటఇంట్లోను, మరొకరు దొడ్లో పనుల్లో వున్నారు.

రామానుజం ఇంట్లో అడుగు పెడుతూనే "ఏమయ్యారు? ఇంట్లో వాళ్ళంతా? దంటది ఇలా గుక్క పెట్టి ఏడుస్తూవుంటే వినపడ్డంలేదు కాబోలు!" అంటూ కేకలు వెయ్యడం మొదలు పెట్టాడు

వంటఇంట్లో పనిలోవున్న ముసలావిడ వచ్చి, ఏడుస్తూన్న పిల్లను ఎత్తుకుని సముదాయిస్తూన్న కొడుకును చూసి నవ్వుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది.

రామానుజం చేతిలోవున్న పిల్లను తేరిపార చూశాడు.. అచ్చంగా అతని పోలికే! చిన్న నవ్వు నవ్వుకుని ముద్దు పెట్టుకున్నాడు.

అప్పటికే స్నానంలోంచి వచ్చి, ప్రక్కగా నిలబడి ఈ దృశ్యాన్ని చూసిన విశాల ఆనందంతో ఉప్పొంగిపోయింది తొందర తొందరగా వచ్చి "ఇలా ఇవ్వండి చాలు కాని. పసిపిల్లను అలా నలిపేస్తే దానికేమన్నా ఊపిరి సలపాలా! వద్దా?" అంటూ చంటిపాపను భర్త చేతుల్లోంచి తీసుకుంది మూతి అదోలా పెట్టి.

రామానుజం తెల్లబోయి "అలాగా" అంటూ గదిలోకి దూరుకున్నాడు.

* * *

ఆరాత్రి ఆకాశాన్నంటిన మబ్బులు పూర్తిగా విడిపోయాయి చంద్రుడు ఆనందాతిరేకంతో వెన్నెలకురిపించి ప్రకృతికి ప్రాణంపోశాడు. రామానుజం ఈసారి మరో ప్రమోషనే కావాలంటే, విశాల ముఖం ముడుచుకుంది!!... ★


## బహుమతి రు. 500

(గవర్నమెంటు రిజిస్టరు)

తెల్ల వెంట్రుకలను పోగొట్టును

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము సువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును ఇదిగాక మెదడుకు చలవనిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు 3-8-0. 3 సీసాలు రు 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు 18/-లు. ఇది పనిచేయదని నిరూపించిన రు 500/-

GENERAL LABORATARIES,
(H O) P O Rajdhanwar (H Bagh).



మీ నిత్యావసరములకు కావలసిన ఆముదము, తేనె, పండ్లపొడి, పన్నీరు, యూకలిప్టస్ ఆయిలు వగైరాలకు :

**శ్రీ వత్స, మద్రాసు-30.**